స్కెచ్

# తిరిగిరాని రోజులు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సముద్రపువొడ్డున కూర్చుని, నీలి కెరటాలు ఒకటే ఒకటే వరసగావచ్చి శిథిలాలయిపోతూంటే, మళ్ళా ఈ కెరటాలలో ఒక్కదానినైనా పునర్నిర్మించే శక్తి ఉందా ఎవరికైనా అనిపిస్తుంది. ప్రతీ కెరటమూ చలించడానికి శక్తీ ప్రాణమూలాగే ఆలోచించడానికీ, బాధ పడడానికీ మనస్సూ ఉంటే, అవి తమతో పుట్టి పెరిగిన ఇతర తరంగాలకలిని చూసి ఏమవుతాయీ?

అట్లాగే అనిపిస్తుంది - ఎప్పుడు ఒక్కణ్ణే సముద్రంవొడ్డున కూర్చున్నా. రోజులన్నీ ఒకటే ఒకటే ఇట్లాగే గడిచిపోతాయే: మళ్ళా ఎలాగనయినా గడిచిపోయిన ఒక్కరోజుని అనంతంలోగా కలుసుకోవడం ఎలాగా? జీవితాన్నంతటినీ ఇచ్చిఅయినా కొనుక్కోవాల్సిన క్షణాలని మరొకసారి...

"ఒట్టి సెంటిమెంటు!"

త్రుళ్ళిపడి వెనుదిరిగిచూశాను...ఇసకని ఎత్తిపోస్తూ, చిన్నగా నవ్వుతూ, మొగలిపొదలకీ నాకూ మధ్యకూర్చుని అన్నది విజయ.

"నాకు హృదయం ఉంది. అందుచేతనే ఈ విషయాలని గురించి ఆలోచించి విచారించగలను. సెంటిమెంటులోనూ నూరుపాళ్ళ సత్యం ఉంది. అందుకని నవ్వ నక్కరలేదు" అన్నాను.

కొంచెం ఊరుకుని, "నువ్వు అసత్యం చెప్తావనీ, సెంటిమెంటులో నిజంలేదనీ కాదుగానేనన్నదీ" అన్నది విజయ.

"మరి?"

"సెంటిమెంటుతో బాధపడడం మరీ అమాయకత్వం అని. అద్దంలో చందమామకోసం ఏడిచాడనుకో... దానిలో వాడి భావోద్రేకం ఉంది; నిజమూ ఉంది...ఏం?"

"వాడికి నిజం తెలీదు" అన్నాడు.

"అదో నిజం - రెండూ కొట్టుకుపోతాయి. మనకి చిన్నపిల్లాడూ, నిజమూ ఎప్పటిలా మిగులుతాయి. అద్దంలో చందమామకోసం వాడూ ఏడుస్తాడు...నీలాగే!"

అప్రయత్నంగా కెరటాలవైపు చూశాను. వాటికని అవిచేసుకుని పోతున్నాయి. కెరటం... ఎక్కడో బయలుదేరుతుంది ప్రయాణం. దాని వెనుక కెరటం...ముందర ఒకటి. అలాగే పయనించి పయనించి తన ప్రస్థానం చేరుకుంటుంది. అక్కడ నాశనం... తెల్లటి నురగలూ, అందాలూ చిందిస్తో...

"ఆ కెరటాలు రావనేగా నీ బాధ?"

"అవును..."

"ఒకటి చెప్పేదా!— నీమల్లే ఇలాగ విచారిస్తూ కూర్చోడంకన్న మరొకలా ఆలోచించు.. ఇక్కడ శిథిలం అయిపోయిన ఈ కెరటం మళ్లా ఆ సముద్రాలమధ్య జన్మించిందనుకో..."

చిత్రంగా వినిపిస్తోంది. వింటున్నాను.

"అదో ఆట...అట్లా అనుకో. పాపాయ్ చేతిలో బంతివిసిరి తనకి దానిని తిరిగితెమ్మనదూ? అప్పుడో...అప్పుడు అన్నీ ఇలాగ నల్లనల్లగా కాకుండా అందంగా కనిపించవూ?"

"కాని, ఈ సత్యాన్ని దాచిపుచ్చుకుని, ఇదంతా ఎలాగ కల్పించుకోనూ? కళ్ళముందు కనిపిస్తోన్న దీన్నంతటినీ కాదని, ఈ కలలన్నిటినీ నిజం అని ఎలాగ భావన చేసుకోనేదీ?"

"అట్లా భావనచేసుకోవడమే జ్ఞానం అంటారు. ఆశావాదన అంటారు...నీ ఆలోచన లన్నిటికీ ఈ రంగు పూశావా, నామల్లే నువ్వూ సుఖిస్తావు!"

ఎందుకనో, అలాగ విజయతో సంభాషణ పొడిగించాలని అనిపించలేదు. ఆ రోజు మరీ బాధాకరంగా పూర్వస్మృతులన్నీ జ్ఞాపకాలు వొస్తున్నాయి. ఆ రోజులు మరొక్కసారివస్తే ఎంతఖరీదు ఇవ్వను! అని...విజయని కదిపితే ఇలాగ ఉంటుంది— నేను నల్లమేఘాన్ని చూస్తే

ఆమె మెరుస్తోన్న బంగారు అంచుల్ని మాత్రం చూస్తుంది.

"గడిచిపోయిన ఆ రోజులూ అట్లానే తిరిగి రావనికదూ, నీ విచారం?" దీనికేం ఉపాయం చెప్తుందోనని, వినసాగాను.

"మూడేళ్ళక్రిందటు నీ ప్రయాణం అంతమైనదీ చివరిసారిగా శశిని కలుసుకున్నదీ, ఈ రోజూ ఈచోటే కాదూ?"

విజయ లేచివొచ్చి నా ప్రక్కని కూర్చుని అడిగింది...ఆమెవైపు చూడకుండానే "అవును" అన్నాను.

ఆ రోజు నీ చేతులు తెగకోసుకుని, మొగలి పువ్వుకోసి ఇచ్చావుకూడా..."

ఊరుకున్నాను. నామనస్సులో ఉండే విజయకి తెలీనివి ఏమున్నాయని.

"పాపం! ఆ అమ్మాయి మళ్ళా కనిపించలేదు!"

హృదయం ఒక్కసారి లాగినట్లైంది—విజయ మరీ నిర్దయగా అంటూంటే.

"నువ్వు మరీ ఫాటలిస్టువి అవుతున్నావు"

"ఎప్పుడూ అంతేలే...అది సరేగాని ఆరోజు మళ్ళీరాదు...రాదుకదూ?"

ఎందుకిట్లా ఏడిపిస్తుంది అనిపించింది.

"కొంచెం ప్రశలు వేసేదా?" కొంచెం ఆగి అడిగింది మళ్ళా విజయ.

"అడుగు"... ఇంకనన్నే మీచెయ్యలేదు అని పించింది.

"సుజాత జ్ఞాపకంవుందీ?"

కొరడాతో కొట్టినట్లనిపించింది .... ఆ పేరుని మళ్లా ఇవాళ ఈమె ఎందుకు బలవంతంగా జ్ఞాపకంచేస్తోంది?. ఆ పీడకలలనించి, ఆ కురూపినించి తప్పించుకొనేసరికి పునర్జన్మ ఎత్తినంత అయింది- ఒక్కసారి ఆ విషయాలన్నీ జ్ఞాపకంవొచ్చాయి.

"దయఉంచి, సుజాతని నీహృదయంలోదాచి పెట్టుకో" అన్నాను కోపంగా.

"పాపం!. ఆమె మాత్రం నీ గతంలోదికదూ? మరి, నీ శశికోసం వెనక్కినడిస్తే, సుజాత ఎదురౌతుంది?"

తేలికగా నవ్వుతూ అన్నది విజయ. భగవాన్! అనుకున్నాను. "పోనీ—అమ్మాయిల జోలి మనకివొద్దు. రఘు జ్ఞాపకం ఉన్నాడా?"

"వాడా?- స్టుపిడ్ -."

"ఆరోజులు,మళ్ళా కావాలా?" తలలోనిపువ్వులని తీసి, వాటిలో ఆడుకుంటూ అడిగిందివిజయ- నాదృష్టిని తనవైపు బలవంతాన త్రిప్పుకుంటూ.

"ఒక్క శశితో..."

"గడిచిపోయిన రోజులనించి ఇది ఎట్లా బయటికి తీస్తావ్?. సుజాతనీ, రఘునీ, ఏం చేస్తావ్?"

అవును—వీళ్ళని ఏం చేస్తాను?. ఆ నరకాలలో మళ్ళా ఒక్క రోజు-ఒక్కక్షణంకూడావొద్దు.

కెరటాలట్లానే వొస్తూ, శిధిలాలౌతూ, మళ్ళా మళ్ళా వొస్తున్నాయి. శిధిలమయినప్రతీకెరటమూ తన అందాలని వొలకబోస్తూనేఉంది. విజయా ప్రతిక్షణము మరీ సౌందర్యంగా కనిపించసాగింది.

"ఇప్పుడు-మరీ అందంగా కనిపిస్తున్నావు!" అన్నాను మైమరచిపోయినట్లు.

మరికొంచెం దూరంజరిగి, "అబ్బాయికి తెలివొచ్చింది" అంది విజయ.

"ఇదో నిజంలే- నీ ఘనత ఏముంది? నువ్వా ఆ సుజాత లాగఉంటే, ఒక్కక్షణం మాటలాడి ఉండేవాణ్ణికాదు" అన్నాను-తరిగి పోయిన దానిలోకొంతైనా గౌరవం కూడకట్టుకోజూస్తూ.

"నాతో మాట్లాడడమేచాలుగా! అన్నీ తెలుస్తాయి. మరి, ఎన్నడూ ఆ రోజులురావనీ, ఈ అలలు రావనీ, విచారించకు. ఆ చక్కటిరోజులు రావు. నిజమే. కాని, ఆ చెడ్డ రోజులూరావు-కాల గమనం ఒకే దిక్కుగా ఉండడం ఇందుకు ఎంత మంచిది!"

పాఠం. నీతి. వింటున్నాను.

"అయినా, మానవుడి జీవితంలో సంతోషం కన్న విచారమే ఎక్కువ ఉంటుంది. అందుకనే, కాలం ఎప్పుడూ వెనక్కినడవదు. అట్లా నడిస్తే నువ్వు శాశ్వతంగా..."

చెవులు మూసుకున్నాను. విజయ ఊరుకుంది. వెన్నెలలు బాగా చిక్కబడ్డాయి. ఈ నిరర్థక వేదాంతంకన్న ఉపకరించే చాలా చక్కని విషయాలు.

వెన్నెలకన్న అందంగా నవ్వింది విజయ. కెరటాల దగ్గరికిపోయి నిలబడ్డాము. ఆ నవ్వులో నాకు కావలసిన లక్షణాలు కనిపించాయి.

మరే రోజులూ నాకక్కరలేదు. ★